క్లుప్తంగా

కూరగాయల టెండర్లకు దరఖాస్తులు

సీతంపేట: గిరిజన గురుకులాలు, మినీ గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరా చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6 వరకు ఆయా విద్యా సంస్థల్లో రూ.500లు చెల్లించి షెడ్యూల్లు పొందాలన్నారు. వచ్చే నెల 9న ఐటీడీఏలో టెండర్లు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బిత్రపాడులో బోరు మరమ్మతు పనులు



బోరు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లబద్ర గ్రామాలలో ఉన్న బోరులను సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు సమక్షంలో మరమ్మతులు చేపట్టారు. కొన్ని వీధులలో తాగునీటి బోర్లు మరమ్మతు కావడంతో వాటిని బాగు చేయించి తాగునీరు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని సర్పంచ్ శ్రీనివాసరావు తెలిపారు. కాలువలలో చెత్తా చెదారం లేకుండా చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

భూ పట్టాల పంపిణీ



రేగులపాడులో రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ రేగులపాడు గ్రామానిక చెందిన 14 మంది లబ్ధిదారులకు సర్పంచ్ చైతన్య స్రవంతి బుధవారం భూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ మేరకు జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా ఈ గ్రామంలో రీ సర్వే పూర్తి కావడంతో భూ హక్కు పత్రాలు(పట్టాలు) మంజూరయ్యాయని సర్పంచ్ తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని సమర్థవంతగా నిలువరించే మెలకువలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు అన్నారు. ఈ తరహా ప్రమాదల సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం శ్రీవేంకటేశ్వర ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ప్రత్యేక డెమో చేపట్టారు. ప్రమాదాలను అదుపుచేసేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, శాఖాపరంగా వినియోగించే ప్రమాద నిరోధకాల వాడకంపై అవగాహన కల్పించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



కోసలి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

భామిని: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – శాశ్వత భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, మండల సర్వేయర్ రాజేశ్వరరావు అన్నారు. భామిని మండలం కోసలిలో భూ సర్వే పనులు ప్రారంభంలో భాగంగా రైతులతో సమావేశమయ్యారు. సర్వేకు వచ్చే అధికారుల బృందానికి రైతుల పట్టాదారు పుస్తకాలు, భూ హక్కు పత్రాలు చూపించి తమ భూములు నిర్ధారించుకోవాలన్నారు. రైతులందరూ సహకరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఆర్ఐ ఎస్.రాంబాబు, కార్యదర్శి ఎం.మహేంద్ర కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



గరుగుబిల్లి: వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

గరుగుబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వున్న మందులు, సామగ్రిని పరిశీలించారు. సిబ్బంది ఫేషియల్ హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సిబ్బంది ఇంటింటిని సందర్శించాలన్నారు. వృద్ధులకు, దీర్ఘకాలిక రోగులకు విధిగా పరీక్షలను నిర్వహించాలన్నారు. ఇంటి వద్ద ఏడు రకాల పరీక్షలను నిర్వహించి, అనారోగ్యాన్ని గుర్తించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల సమాచారాన్ని అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



పాలకొండ: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: గుణదలో ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతోంది. మండలంలోని కొండాపురం గ్రామంలో బుధవారం వైద్య సిబ్బంది సర్వే చేశారు. ప్రజలకు పలు పరీక్షలు చేశారు. గ్రామంలో అక్టోబర్ 6న వైద్య శిబిరం నిర్వహిస్తామని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ తెలిపారు.

గుమ్మలక్ష్మీపురంలో...

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 15 తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. గుణద గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు సర్వే నిర్వహించారు. ఇప్పటికే వ్యాధులతో బాధ పడుతున్న వారిని కూడా గుర్తించి నిర్ణయించిన తేదీన నిర్వహించే ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చి నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు పొందాలని కోరారు. ఇరిడి ఎంపీటీసి కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా మళ్లీ కళావతినే గెలిపించుకుంటాం..



ఎమ్మెల్యే కళావతికి మద్దతు తెలియజేస్తున్న నాయకులు

● వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతినే రానున్న ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని సీతంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. స్థానిక ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హిమరక మోహన్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పార్టీలోనే ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి, విద్యుత్ సౌకర్యం వంటి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే పిర్యాదు చేస్తే స్పందిస్తారన్నారు. ఆమెకే పూర్తి స్థాయిలో ఏజెన్సీ ప్రజల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకునాయుడు, రవి, గంగారావు, రామారావు, ఎస్.సిమ్మయ్య, ఎంపీటీసీలు హరిబాబు, ఎస్.చంద్రశేఖరరావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.వెంకటేష్, ఎస్.అబ్బాస్, ఎస్.కృష్ణ, సాయికుమార్, సోమేశ్వరరావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



బత్తిలిలో ఆక్రమణలు పరిశీలిస్తున్న మండల అధికారుల బృందం

భామిని: మండలంలోని బత్తిలి బస్టాండ్ వద్ద ఏబీ రోడ్డుకు ఇరువైపులా జరిగిన ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎస్ఐ వై.అమ్మనరావు, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డుకు ఆక్రమించి ఉన్న వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. మండల సర్వేయరు రాజేశ్వరరావు, వీఆర్ఓ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కొలతలు తీసి ఆక్రమణలను తొలగించారు. ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు, ఎంఆర్ఐ ఎస్.రాంబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కాఫీ విత్ క్లాప్ మిత్ర



క్లాప్‌మిత్రకు సన్మానిస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: మండలంలోని దారపాడు గ్రామ సచివాలయం పరిధిలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కె.సత్యం ఆధ్వర్యంలో క్లాప్ మిత్రులకు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో దారపాడు, గుమ్మడ సర్పంచ్‌లు సుందరమ్మ, ప్రదాని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎఫ్ఓకు సన్మానం



ఎఫ్ఓ గోపాలకృష్ణను సన్మానిస్తున్న వీఓఏలు, బ్యాంక్ మిత్రలు

భామిని: బత్తిలి ఏపీజీవీబీ ఫీల్డ్ అసిస్టెంట్ పి.గోపీకృష్ణకు బ్యాంకు మిత్రలు, వెలుగు వీఓఏలు బుధవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఎఫ్ఓ సేవలను గుర్తు చేసుకున్నారు. మేనేజర్ బంగారునాయుడు, క్యాషియర్ వెంకటరమణ, బ్యాంక్ సిబ్బంది ప్రత్యేకంగా సన్మానించారు. మహిళా సంఘాల ప్రతినిధులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలపై పట్టు అవసరం

పాలకొండ రూరల్: జాతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, అందుకు సంబంధించిన పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు సరైన పట్టు, అవగాహన ఉండాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉత్తరావిల్లి సత్యప్రభ అన్నారు. కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా టూరిజం క్లబ్ తరపున, జిల్లా పర్యాటక శాఖ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సూచనల మేరకు వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల విశిష్టతపై ఈ పోటీలు చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్‌బాబు, బాల మురళి, కృష్ణ ప్రతాప్, పుష్పనాథం, లావణ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



లుంబేసు సచివాలయంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లుంబేస్ గ్రామ పంచాయతీ ప్రజలు తెలియజేశారు. ఈ మేరకు లుంబేస్ గ్రామ సచివాలయం వద్ద 139 మంది గిరిజనులు భూములు రీ సర్వే అనంతరం మంజూరైన భూమి పట్టాలను బుధవారం సర్పంచ్ తోయక సీతమ్మ ఎంపీటీసీ మండంగి గౌరమ్మ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గిరిజనులకు శాశ్వత భూ హక్కు పట్టాలు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ తోయక మధవరావు, వైస్ సర్పంచ్ రామారావు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు ఉన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



శోభాయాత్రలో కోలాటాల్లో యువతుల బృందాల సందడి

భామిని: భామిని కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయకుని నిమజ్జన శోభాయాత్ర బుధవారం పలు నృత్యాలు నడుమ సందడిగా సాగింది. యువతులు, యువకులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి కోలాటాలు, నృత్యాలతో సందడి చేస్తూ అలరించారు. ముందుగా లడ్డు ప్రసాదాన్ని లాటరీ తీసి భక్తునికి అందించారు. గురండి, బాలేరు, పసుకుడిలలో నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

గాంధీ జీవితం అనుసరణీయం



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాలకొండ రూరల్: జాతిపిత మహాత్మా గాంధీజీ జీవితం అనుసరణీయమని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాలలో గాంధీ జయంతి వారోత్సవాలను బుధవారం ప్రారంభించారు. తొలిత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ ఈ జయంతి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 2వ తేదీన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఐక్యూఏసీ నేతృత్వంలో గాంధీజీ సందేశాలు, జీవితగాథపై అవగాహన కార్యక్రమం జరిగింది.

విస్తృతంగా ఇంటింట సర్వే

పాలకొండ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా ఇంటింట సర్వేను క్షుణ్ణంగా చేపట్టాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి తేజరత్నరాజు అన్నారు. బుధవారం వైద్యాధికారి నేతృత్వంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను విస్తృతంగా చేపట్టారు. దేవరపేట, కుమ్మరివీది, కోమటిపేట, చిన్న కాపువీధితో పాటు పలు వార్డుల్లో ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను నమోదు చేసారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులను గుర్తించారు. ఈ క్రమంలో పలు ఆరోగ్య సమస్యల నిర్ధారణకు సంబంధించిన రక్త పరీక్షలు చేపట్టారు. త్వరలో చేపట్టనున్న ఉచిత మెగా వైద్యశిబిరాల ద్వారా బాధితులకు సేవలు అందిస్తామని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



శరవేగంగా కుమ్మరి వీధిలో రహదారి, కాలువ పనులు

పాలకొండ రూరల్: పట్టణంలోని కుమ్మరి వీధిలో దీర్ఘ కాలంగా ఉన్న రహదారి, వీధి కాలువల సమస్యకు పరిష్కారం లభించింది. ఇటీవల ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రహదారి, కాలువ సమస్యలను స్థానికులు విన్నవించారు. సంబంధిత పనుల పూర్తికి రూ.10 లక్షల నిధులు జీజీఎంపీ నుంచి కేటాయించటంతో యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. బుధవారం అక్కడి కౌన్సిలర్ కోడెం విజయ్‌కుమార్‌తో పాటు నగర పంచాయతీ ఇంజినీరింగ్ అధికారులు పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ త్వరలో తమ వార్డు పరిధిలో మరికొన్ని రహదారుల నిర్మాణాలు చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు.

అర్హులందరికీ ఇళ్లు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: అర్హులైన గిరిజనులందరికీ గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోజిషన్ సర్టిఫికెట్లు ఉన్న వారందరికీ గృహాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సీతంపేట ఏజెన్సీలో దాదాపు 4 వేల గృహాలు నిరుపేదలకు మంజూరు చేయాలని ఇటీవల స్థానిక ఎమ్మెల్యేతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి : డీఈఓ



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యనందించాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తూరు క్లాంపెక్స్‌లో జరుగుతున్న సమావేశాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక మార్పులను ఉపాధ్యాయులు వినియోగించుకొని నిత్య విద్యార్థిలా వుండాలన్నారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఏపీఓ వై.శంకరరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి.శ్రీరామచంద్రమూర్తి తదితరులున్నారు. అనంతరం కొత్తూరులో నిర్వహిస్తున్న నాడు – నేడు పనులను ఆయన పరిశీలించారు.

బడి బయట పిల్లలపై సర్వే



స్థానిక సచివాలయంలో వలంటీర్లు ద్వారా పిల్లల సర్వేపై ఆరా తీస్తున్న ఎంఈఓ

వీరఘట్టం: బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లోనే ఉండాలనే ప్రభుత్వం నిర్ణయంతో విద్యాశాఖ అధికారులు వలంటీర్లు సహాయంతో ముమ్మరంగా సర్వే చేపడుతున్నారు. బుధవారం వీరఘట్టం ఎంఈఓ ఆర్.ఆనందరావు స్థానిక మేజరు పంచాయతీలో సచివాలయం 3, 4 పరిధిలో సర్వే చేపట్టారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ఉన్న 417 క్లస్టర్లలో 8,348 మంది బడి ఈడు పిల్లలు ఉన్నట్లు ప్రభుత్వం నివేదించిందన్నారు. ఇంత వరకు 8283 మంది పిల్లలు వివిద ప్రాంతాల్లో చదువుతున్నట్లు గుర్తించామని ఎంఈఓ తెలిపారు. వీరిలో వీరఘట్టం మండలంలో 5715 మందిని గుర్తించామన్నారు. మిగిలిన పిల్లలను కూడా గుర్తించే పనిలో తామంతా ముమ్మరంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులను మరువొద్దు...



కొమరాడ: కేజీబీవీ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



భామిని: మేరా మట్టి- మేరా దేశ్ కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు

కొమరాడ: దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన సమరయోధులను నిత్యం స్మరించుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.అరుణ్ అన్నారు. మండలంలోని కేజీబీవీలో మేరా మట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో నా దేశం ఐక్యత కోసం సంఘీభావం ప్రకటిస్తూ నిరంతరం కృషి చేస్తామని విద్యార్థులు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణత్యాగాలు చేశారన్నారు. వారిని గుర్తించుకోవడం మన బాధ్యతన్నారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భామినిలో...

భామిని: దేశ ఔన్నత్యాన్ని గుర్తు చేసుకునేలా మేరా మట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి బి.శారద అన్నారు. కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఆమె విద్యార్థులకు దేశ స్వాతంత్ర్య సాధనలో జరిగిన ఘటనలను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ఎల్విన్‌పేట సంగీత గ్యాస్ బుకింగ్ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్యాస్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అగ్నిమాపక సిబ్బంది నాయుడు, తిరుపతి, మురళి తదితరులు పాల్గొన్నారు. గ్యాస్ వినియోగం లో జరిగే అగ్ని ప్రమాదాలపై గుమ్మలక్ష్మీపురంలో అగ్ని మాపక సిబ్బంది నాయుడు,తిరుపతి,మురళి

'జగనన్నకు చెబుదాం' రేపు

పాలకొండ:

ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తామని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయం సమావేశ మందిరంలో 29వ తేదీ ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమక్షంలో ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పరిశీలన చేస్తారని తెలిపారు.